

మా బడి మాక్కావాలి

కలెక్టరేట్లో వేడాం గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మా బడి మాకు కావాలంటూ శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని వేడాం గ్రామస్తులు విద్యాశాఖాధికారులకు వ్యతిరేకంగా గురువారం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. వేడాం ప్రాథమిక పాఠశాలలో సుమారు 40 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, మోడల్ స్కూల్స్-విలీన ప్రక్రియలో భాగంగా 3, 4, 5 తరగతులను సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న బీసీ కాలనీలో కలిపారని వాపోయారు. బీసీ కాలనీ వెళ్లే మార్గంలో వర్షా కాలం వాగులు, చెరువులు ఉప్పొంగుతాయని అన్నారు. ఈ నేపథ్యంలో అక్కడికి తమ పిల్లలను ఎలా పంపాలని ప్రశ్నించారు. అధికారులు తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని సూచించారు.

సైకో చేష్టలకు.. భార్యాబిడ్డలు బలి..!

మద్దినాయనిపల్లి దళితవాడలో విషాదం

ప్రజాశక్తి రామచంద్రపురం(పాకాల)

భార్యతో పడకపోతే దూరంగా ఉండాలి..లేదంటే కోర్టును ఆశ్రయించాలి. అన్నెంపున్నెం ఎరుగని పిల్లలేం చేశారు.. తీరా కుటుంబం బలైన తరువాత ఇటీవల కాలంలో సైకోగా వ్యవహరిస్తున్నాడని బంధువులు చెబుతున్నారు. అదే నిజమైతే కౌన్సిలింగ్ సెంటర్‌లో చూపించి మందులు వాడాలి.. ఏమైతేనేం క్షణికావేశం భార్యాబిడ్డలు బలయ్యారు.. సైకో టి.గిరి చేష్టలకు భార్య హేమలత (39), తనుశ్రీ (12), తేజశ్రీ (8)లను పాడుబడిన బావిలో తోసేసి హత్య చేశాడు. అనంతరం గొంతు కోసుకుని బావిలో దూకాడు. అటుగా వెళుతున్న గ్రామస్తుడు ఈ ఘటనను చూసి గ్రామస్తులకు చెప్పడంతో గిరిని కాపాడగలిగారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ దారుణ ఘటన తిరుపతి జిల్లా పాకాల మండలం మద్దినాయనిపల్లి దళితవాడలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..

టి.గిరి, హేమలత 13 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. గిరి తిరుపతిలో ఎలక్ట్రికల్ పనులు చేసుకుని కుమార్తెలను చదివించుకుంటూ సజావుగానే ఉండేవాడు. అయితే ఇటీవల కాలంలో భార్యాభర్తల తరచూ కుటుంబ కలహాలతో గొడవ పడేవారు. బుధవారం మధ్యాహ్నం భార్య ఇద్దరు పిల్లలను తన ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని స్వగ్రామమైన మద్దినాయనిపల్లి దళితవాడకు వచ్చారు. మరోసారి భార్యాభర్తలు గొడవ పడ్డారు. గురువారం మధ్యాహ్నం మద్దినాయనిపల్లి దళితవాడ నుంచి స్కూటర్లో భార్యాబిడ్డల్ని ఎక్కించుకుని రోడ్డు పక్కనే ఉన్న పాడుబడిన బావిలో వారిని తోసేసి చంపేశాడు. అయితే అదే సమయంలో అటుగా ఓ వ్యక్తి రావడం చూసి తన దగ్గర ఉన్న కత్తితో గొంతు కోసుకుని బావిలో దూకేశాడు. గిరికి ఈత రావడంతో బావి మెట్లు దగ్గరకు వచ్చేశాడు. గిరి భార్యాబిడ్డల్ని బావిలో తోసి చంపేశాడన్న విషయాన్ని గ్రామస్తులకు చూసిన వ్యక్తి ఫోన్ ద్వారా చేరవేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న గిరిని కాపాడేందుకు ఆటోలో వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తులు బావి దగ్గరకు వచ్చి పరిశీలించగా భార్య హేమలత, చిన్న కుమార్తె తేజశ్రీ మృతదేహాలు బావిలో నీటిపై తేలుతూ కనిపించాయి. పాకాల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిఐ సుదర్శన్ ప్రసాద్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బంది సాయంతో బావిలో తల్లీకూతుళ్ళ మృతదేహాలను వెలికితీశారు. పంచనామా అనంతరం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. టి.గిరి మానసిక పరిస్థితి గత కొన్నాళ్లుగా సరిగా లేదని, సైకోలా వ్యవహరిస్తున్నాడని బంధువులు తెలిపారు. సిఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నమ్మించి..వంచించి..హత్య..!

నెలరోజుల ముందే పక్కాప్లాన్

'రంగంలోకి... రాయుడి అమ్మమ్మ'

వినుత మాజీ డ్రైవర్ రాయుడును నెల రోజుల కిందటే అంతమొందించేందుకు పథకం వేశారని, నమ్మించి.. వంచించి.. హింసించి హత్య చేసినట్లుగా రాయుడి అమ్మమ్మ రాజేశ్వరమ్మ గురువారం ఓ మీడియాకిచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ జనసేన కార్యకర్త, శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ మాజీ ఇంచార్జి వినుత మాజీ డ్రైవర్ శ్రీనివాసులు అలియాస్ రాయుడు(22) హత్యకు గురైన సంగతి అందరికీ తెలిసిందే.ఈ కేసుకు సంబంధించి 12వ తేదీన వినుత దంపతులతో పాటు మరో ముగ్గురిని నిందితులుగా చేర్చి రిమాండ్ కు పంపారు. అయితే రోజులు గడిచే కొద్దీ రాయుడు హత్య చుట్టూ రాజకీయరంగు అలముకుంటున్న నేపథ్యంలో రాయుడి అవ్వ రాజేశ్వరమ్మ గురువారం ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూ సంచలనాన్ని రేకెత్తించింది. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'వినుతకు సంబంధించిన రాజకీయ అంశాలను, వ్యక్తిగత సమాచారాన్ని రాయుడు ఇతరులకు చేరవేస్తున్నాడనీ, ప్రతిగా ఓ పార్టీ నుంచి అతనికి రూ.30 లక్షలు ముట్టాయని వినుత దంపతుల ఆరోపణ. అంతేకాకుండా ఆమె బెడ్ రూమ్‌లో రాయుడు ఫోను కెమెరా ఆన్ చేసి ఉంచిన విషయాన్ని గుర్తించారు. ప్రశ్నించినందుకు గోడ దూకి పారిపోయే ప్రయత్నం చేయగా కాలు విరుచుకున్నాడు. ఆ విషయం ఇంటికి పిలిపించి వినుత దంపతులు స్వయంగా నాతో చెప్పారు. రాయుడు కాలు బాగయ్యే వరకు ఇక్కడే ఉంటాడనీ, కంగారు పడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పి నన్ను పంపేశారు. తీరా మూడో దశ కట్లు విప్పాక ఓ జనసేన కార్యకర్త వచ్చి నన్ను మరోసారి రేణిగుంటలోని వినుత నివాసానికి తీసుకెళ్లారు. ఆ సందర్భంగా వినుత దంపతులు రాయుడు చేసిన తప్పులను ఎత్తిచూపుతూ ఆడియో మెసేజ్‌లు, వీడియోలు, కాల్ డేటాలను నాకు చూపించారు. ఇలాంటి చెత్త పనులు చేసిన వాడిని ఎలా వదిలేయాలంటూ నన్ను ప్రశ్నించారు. పెద్ద మనసు చేసుకొని వదిలేయాలని, తమ బిడ్డకు ప్రాణభిక్ష పెట్టాలని వినుత దంపతుల కాళ్లావేళ్లా పడ్డాను. దీంతో వారు చివరి హెచ్చరిక చేస్తూ ఎక్కడికైనా దూరంగా పారిపో అంటూ రూ. 2 వేలు రవాణా చార్జీలు రాయుడికి ఇచ్చారు. ఇదే క్రమంలో ఓ లాయర్‌ను తీసుకొచ్చి తమకు రాయుడుకు సంబంధం లేనట్టుగా ఓ బాండు రాసుకున్నారనీ, అదేవిధంగా రెండు తెల్ల కాగితాలపైన కూడా సంతకాలు చేయించుకున్నారని తెలిపారు. ఎందుకు అని అడిగితే తమ భద్రత కోసమని చెప్పారు. అనంతరం వారే ఏర్పాటుచేసిన రెండు ఆటోలలో తాము రేణిగుంట బస్టాండ్ వరకు చేరుకున్నట్లు వివరించారు. అయితే రాయుడు తమతో కాకుండా దూరంగా వెళ్లిపోతున్నట్లు ఆటోలో ముందుకు సాగిపోయాడని చెప్పారు. దీంతో తమ బిడ్డ ఎక్కడైనా క్షేమంగా ఉంటాడు లే అని ఇంటికి చేరుకున్నామని అన్నారు. అయితే మూడు రోజులైనా రాయుడి నుంచి ఎలాంటి ఫోన్ రాకపోవడంతో ఎలాగైనా తమ బిడ్డ ఆచూకీ కనిపెట్టాలని వినుత దంపతులను కోరినట్లు ఆమె తెలిపారు. రాయుడుతో మాకేం సంబంధమనీ, అయినా రెండు మూడు రోజుల్లో ఫోన్ చేస్తాడులే అని సమాధానమిస్తూ ఇంటికి తిప్పి పంపారని చెప్పారు. వారు చెప్పినట్లుగానే రాయుడు ఫోన్ చేశాడనీ, చెన్నైలోని ఓ ఫ్రెండ్ ఇంట్లో క్షేమంగా ఉన్నట్లు చెప్పుకొచ్చాడని రాజేశ్వరమ్మ తెలిపారు. ఇదిలా ఉండగానే ఈ నెల 8వ తేదీన జనసేనకు చెందిన ఒక కార్యకర్త వచ్చి వినుత దంపతులు మిమ్మల్ని తీసుకురమ్మన్నారని చెప్పి కారులో ఎక్కించుకుని పోయాడని అన్నారు. ఎక్కడికని అడిగినా చెప్పలేదనీ, తీరా కారు నేరుగా చెన్నై లోని ఓ పోలీస్ స్టేషన్ వద్ద ఆగిందని అన్నారు. చెన్నైలో సచ్చేవోడు చేతిపై నా పేరు ఎందుకు రాసుకుని సచ్చాడని అక్కడే పోలీస్ స్టేషన్లో ఉన్న వినుత వాపోయిందని అన్నారు. అప్పటికి మనవడు చెన్నైలో ఉన్నాడు కదా..! అందుకు అలా అని ఉంటుందని భ్రమపడినట్లుగా రాజేశ్వరమ్మ తెలిపారు. వినుత దంపతులతో పాటు శివకుమార్, గోపి, దస్తగిరి కూడా అక్కడే ఉండడంతో మనవడుని కూడా చూపించాలని అర్థించానని అన్నారు. ఇదంతా వింటున్న ఓ పోలీసు అధికారి తన ఫోన్ లో రాయుడి మృతదేహాన్ని చూపించడంతో కాళ్లు చేతులు ఆడక మాట పడిపోయిందని అన్నారు. రాయుడు చెన్నై వెళ్లినట్లు తిరిగి రేణిగుంటకు తీసుకొచ్చి నిర్బంధించి విచారించినట్లుగా వినుత భర్త చంద్రబాబు పోలీసులకు చెప్పారని ఆమె అన్నారు. ఈ క్రమంలో తీవ్ర అనారోగ్యానికి గురైన రాయుడు నిర్బంధంలోనే మరణించినట్లుగా పోలీసుల ఎదుట వాంగ్మూలం ఇచ్చాడని అన్నారు. అంతా నమ్మించి.. వంచించి.. హింసించి రాయుడిని హత్య చేశారని ఆమె మీడియా ఎదుట వాపోయారు. నిందితులకు కఠిన శిక్షపడేలా చెన్నై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఇంత జరుగుతున్న జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నుంచి కనీస స్పందన లేకపోవడం బాధాకరమని ఆమె వాపోయారు.

నాకెలాంటి సంబంధం లేదు: ఎమ్మెల్యే బొజ్జల

రాయుడి హత్య, వినుత రాజకీయ వ్యవహారాల విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తిరుమల వెంకన్న సాక్షిగా స్పష్టం చేశారు. వైసిపి నేతలు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. కుటుంబం.. దేవుడు సాక్షిగా ఈ విషయాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు.

భద్రత కల్పించండి: కీర్తన, రాయుడి చెల్లి

రాయుడు హత్య కేసులో అతని చెల్లెలు కీర్తన శ్రీకాహస్తి డీఎస్పీకి గురువారం ఫిర్యాదు చేసింది. వినుత అనుచరగణం నుంచి తమకు ప్రాణహాని ఉందనీ, భద్రత కల్పించాలని కోరింది. తప్పు నుంచి బయటపడేందుకు వినుత అనుచరగణం రూ. 30 లక్షలు ఆఫర్ చేసిందన్నారు. రాయుడుపై సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలు తప్పనీ, తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. రాయుడి హత్యలో మరింత మంది హస్తం ఉండే అవకాశం ఉందన్న అనుమానాలున్నాయని తెలిపారు. అలాగే పవన్ కళ్యాణ్ స్పందించి న్యాయం చేయాలని, ఆయనతో మాట్లాడే అవకాశం కల్పించాలని మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు.

కన్నబిడ్డపై తండ్రి లైంగిక దాడి

చింతగుంట అరుంధతి వాడలో...

దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

ప్రజాశక్తి - యర్రావారిపాలెం

యర్రావారిపాలెం మండలం చింతగుంట అరుంధతివాడలో మద్యం తాగి, వావివరసలు మరచి రక్తం పంచుకుని కడుపున పుట్టిన కన్నబిడ్డపైనే లైంగికదాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల్లో ఆగ్రహాన్ని కలిగించింది. నిందితున్ని కరెంట్ స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి లక్ష్మి, ఈశ్వరమ్మ స్పందిస్తూ కామాంధుడైన మునిరాజపై పోక్సో కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గ్రామస్తుల వివరాల మేరకు..

చింతగుంట గ్రామపంచాయతీ అరుంధతి వాడలో మాతమ్మ జాతర జరుగుతోంది. గ్రామస్తులు జాతరలో నిమగ్నమై ఉండగా మద్యం తాగి భార్యతో గొడవపడి ఎనిమిదో తరగతి చదువుతున్న కన్నకూతురు (13)పై అదే ఊరిలో ఉన్న అత్తారింటికి వెళదాం రమ్మని బలత్కారం చేయబోయాడు. కుమార్తె భయపడి వెళ్లకపోవడంతో బెదిరించాడు. ఈ విషయం భయపడుతూ తన తల్లి దగ్గరకు వెళ్లి రెండు నెలలుగా తనపై లైంగిక దాడి చేస్తున్నాడని, ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడని చెప్పింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు తండ్రి మునిరాజను కరెంట్ స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. గ్రామ సచివాలయ మహిళా పోలీసు ద్వారా తల్లి (భార్య) ఫిర్యాదు మేరకు ఎస్ఐ నిందితున్ని స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నారు. సభ్యసమాజం తలదించుకునేలా ప్రవర్తించిన మునిరాజను కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇటువంటి వ్యక్తి గ్రామంలో ఉంటే తమ బిడ్డలకు భద్రత ఉండదని మండిపడ్డారు.

ఆగిన గుండెకు 'ఆస్టర్'లో చలనం

నారాయణాద్రి వైద్యుల అద్భుతం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

హార్ట్ అటాక్, కార్డియాక్ అరెస్టు తర్వాత, కారులో సిపిఆర్ చేస్తూ ఆసుపత్రికి తీసుకెళ్లిన రోగి – ఆస్టర్ నారాయణాద్రిలో ప్రాణాలతో బయటపడటం అద్భుతమని ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అభిషేక్ కాషా తెలిపారు. స్థానిక రేణిగుంట రోడ్డు లోని ఆస్టర్ నారాయణద్రి హాస్పెటల్ లో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఒక జీవితాన్ని రక్షించగలగడం వైద్యవృత్తిలో దక్కే గొప్ప గౌరవం. ఈ కేస్‌లో అసాధ్యమైన పరిస్థితిని సాధ్యం చేయగలిగాం అన్నారు. 45 ఏళ్ల ఉదయ్ భాస్కర్ హార్ట్ అటాక్‌తో ఇంట్లోనే కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు కారులో సిపిఆర్ చేస్తూ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికే ఆయన అసిస్టోల్ స్టేట్‌లో (సుదీర్ఘ గుండె ఆగిపోవడం) ఉన్నారు. మా ఎమర్జెన్సీ టీమ్ తక్షణమే ఏసీఎల్స్ ప్రోటోకాల్ ప్రారంభించి, డీసీ షాక్ ద్వారా గుండె తిరిగి పనిచేయించగలిగింది. ప్రస్తుతం రోగి నడుస్తూ, మాట్లాడుతూ ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యారు. ఇది అసిస్టోల్ నుండి పూర్తిస్థాయి రికవరీకి చేరిన అరుదైన ఉదాహరణ. మల్టీడిసిప్లినరీ టీమ్ వర్క్ వల్లే ఇది సాధ్యమైందని పేషెంట్ కుటుంబం తరపున తమ టీమ్‌కి అభినందనలు అందాయన్నారు. డైరెక్టర్ డాక్టర్. ఎస్.వి ప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ వి. సునంద కుమార్ రెడ్డి, సిఓఓ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో నారాయణాద్రి వైద్యులు

రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న వందవాసి నాగరాజు

స్మార్ట్‌మీటర్లను తిప్పికొడదాం

వామపక్ష ప్రజాసంఘాల పిలుపు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

జనాన్ని చైతన్యపరచి అదానీ స్మార్ట్‌మీటర్లను తిప్పికొట్టాలని, ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో వామపక్ష,ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాయపనేని హరికృష్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కందారపు మురళి ప్రసంగించారు. జగన్ సర్కారు పోయి బాబు ప్రభుత్వం వచ్చినా విద్యుత్ షాక్‌లు ఆగడం లేదన్నారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో షాక్‌ల మీద షాక్‌లు ఇస్తూనే ఉన్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రపంచబ్యాంక్ ప్రయోగశాలగా మారిందన్నారు. యూజర్‌ఛార్జీల పేరుతో మొదలైన భారాలు ట్రూఅప్ ఛార్జీలతో కొనసాగుతోందన్నారు. ప్రపంచబ్యాంక్ ఆదేశాల మేరకు విద్యుత్ బోర్డును జనరేషన్, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ అనే మూడు ముక్కలు చేసి వాటిని తమకు నచ్చినట్లు ఆడించడానికి ఓ రెగ్యులేటరీ కమిషన్ ఇఆర్‌సిని ఏర్పాటు చేస్తూ చట్టం తెచ్చారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ప్రపంచబ్యాంక్ సంస్కరణలు రకరకాల పేరుతో కొనసాగుతూనే ఉన్నాయన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నుంచి గ్రాంట్, వాటా రావాలంటే వాటిని పాటించాల్సిందేనని నీతిఅయోగ్ ద్వారా ఉత్తర్వులిస్తున్నారన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కేంద్రాలన్నీ అదానీకి కట్టబెట్టారని, మొదటిదశలో వ్యవసాయానికి మీటర్లు పెట్టడం, రెండో దశలో ఇళ్లకు బిగించే కార్యక్రమం ప్రారంభమయ్యిందన్నారు. ఎవరైనా అదానీ స్మార్ట్ మీటర్ బిగించడానికి వస్తే వ్యతిరేకించాలన్నారు. అదానీ స్మార్ట్ మీటర్ల వద్ద స్మార్ట్ ఫోన్లు రీఛార్జి చేసుకున్నట్లే ముందస్తుగా విద్యుత్ కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురిస్తుందన్నారు. స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ దశలవారీ కార్యక్రమాలు ఆగస్టు 5వరకూ కొనసాగుతాయన్నారు. నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నపుడు 'పగలగొట్టండి' అని మాట్లాడిన మాటలనే మనం ఆచరణలో పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి సుబ్రమణ్యం, కే వేణుగోపాల్, ఎం మాధవ్, పి సాయి లక్ష్మి, పి బుజ్జి, నరేంద్ర, వెంకటరత్నం, అరుణ, డిహెచ్పిఎస్ నాయకులు నాగభూషణం పాల్గొన్నారు.

రేపు సీఎం చంద్రబాబు రాక

ప్రజాశక్తి- రేణిగుంట

రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు జూలై 19 వ తేదీన శనివారం తిరుపతిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో సీఎం పర్యటనలో చిన్నపాటి లోపాలకు తావివ్వరాదని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం రేణిగుంట విమానాశ్రయంలో కలెక్టర్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సంబంధిత అధికారులతో సిఎం పర్యటన భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శనివారం ఉదయం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని తిరుపతి లో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్ననున్నారని, అనంతరము ప్రజా వేదిక అనంతరం ఐఐటి ఏర్పేడు కార్యక్రమంలో పాల్గొని, తిరిగి రేణిగుంట విమానాశ్రయం చేరుకొని తిరుగు ప్రయాణం కానున్నారని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటించు తూకివాకం వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్, కపిల్ తీర్థం, పోలీస్ పెరేడ్ గ్రౌండ్, ఐఐటి ఏర్పేడు ప్రదేశాలలో పర్యటించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ లు రవి మనోహరాచారి, వెంకట్రావు, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ , రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రాధ, జిల్లా ఫైర్ అధికారి రమణయ్య పాల్గొన్నారు.

పద్మావతి అమ్మవారి సేవలో తుడా చైర్మన్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని తిరుపతి పట్టణాభివద్ధి సంస్థ చైర్మన్, టిటిడి ఎక్స్ అఫీషియో సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి, బీహార్‌కు చెందిన ప్రీతం స్వామీజీతో కలిసి దర్శించుకున్నారు. వీరికి ఆలయం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం ఏర్పాట్లను చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శించుకున్న అనంతరం పండితులు వేద ఆశీర్వచనం ఇవ్వగా టిటిడి అధికారులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

అత్యుత్తమ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా స్విమ్స్

రూ.22.01 కోట్ల విలువైన వైద్యయంత్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు స్విమ్స్‌ను ఎన్టీఆర్ ప్రారంభించారని,దేశంలో అత్యుత్తమ వైద్య సేవా సంస్థగా తీర్చిదిద్దేందుకు కషి చేస్తున్నామని టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్. నాయుడు చెప్పారు. ఇందుకోసం టీటీడీ అవసరమైన సదుపాయాలు కల్పిస్తోందని, ఏడాదికి రూ.140 కోట్లు అందిస్తూ, ఆసుపత్రి అభివద్ధికి విశేష కషి చేస్తోందని చెప్పారు. స్విమ్స్ లో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఎం.ఆర్.ఐ, సిటీ స్కానర్ లను ఛైర్మన్ గురువారం ప్రారంభించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రూ. 22.01 కోట్ల విలువైన యంత్రాలను టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవెంకటేశ్వర వైద్య కళాశాల (స్విమ్స్)కు విరాళంగా అందించింది. ఇందులో రూ. 14 కోట్లు విలువైన 3 టెస్లా ఎమ్ఆర్ఐ స్కానర్ – 1, 8 కోట్లు విలువైన 4డి సిటి సిమ్యులేటర్ సిస్టం – 1 వున్నాయి. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో ఈ యంత్రాలను స్విమ్స్‌లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేన్సర్ రోగులకు ఎలాంటి సైడ్ఎఫెక్ట్స్ లేకుండా కేన్సర్ గడ్డల గుర్తింపు, కేన్సర్ వ్యాధి ఏఏ అవయవాలకు ఎంతెంత మోతాదులో పాకిందో గుర్తించవచ్చున్నారు. ఏడాదికి 2.5 లక్షల మందికి పైగా పేద రోగులకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించేందుకు ఈ యంత్రాలు ఉపయోగపడతాయన్నారు. ఐఓసిఎల్ మార్కెటింగ్ డైరెక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా స్విమ్స్ కు ఈ వైద్య పరికరాలను అందించామన్నారు. స్విమ్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ టిటిడి ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా అత్యుత్తమ సేవలందిస్తున్నామన్నారు. కేంద్ర పెట్రోలియం నేచురల్ గ్యాస్ శాఖ మంత్రి హరిదీప్ సింగ్ పూరి విద్యార్థులను, డాక్టర్లను ఉద్దేశించి ఉపన్యసిస్తూ టిటిడికి చెందిన స్విమ్స్ కు ఐఓసిఎల్ సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా విరాళం అందించడం సంతోషకరమని మాట్లాడిన వీడియోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా టిటిడి ఛైర్మన్ ను, ఐఓసిఎల్ ప్రతినిధులను స్విమ్స్ డైరెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో తుడా ఛైర్మన్, టీటీడీ బోర్డు సభ్యులు డాలర్ దివాకర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (హెచ్ ఆర్) ముకేష్ రాజన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి, ఐఓసీఎల్ ప్రతినిధులు దత్తాత్రేయ, బద్రినాథ్ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో అధునాతన వైద్య పరికరాలను ప్రారంభిస్తూ...

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వినూత్న నిరసన

ప్రజాశక్తి - నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు టౌన్ (తిరుపతి జిల్లా)

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెలో భాగంగా గురువారం శిబిరం వద్ద మోకాళ్లపై దండం పెడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. 'సిఎం సారూ..దండంపెడతాం.. జీతం పెంచండి' అంటూ వేడుకొన్నారు. సిఐటియు నాయకులు శివకవి ముకుంద మాట్లాడుతూ ఐదు రోజులుగా కార్మికులు సమ్మెలో ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. జీతాలు పెంచేంత వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు. సమ్మెకాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కార్మికులు నాగరాజు, శ్రీనివాసులు, కాలేషా, రమేష్, చిరంజీవి, లీలామోహన్, రామచంద్రయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

– సూళ్లూరుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులకు తప్పెట కళాకారుల సంఘం నాయకులు కెవి మునెయ్య, కెవిపిఎస్ జిల్లా నాయకులు డి.ప్రభాకర్ తమ సంఘాల తరపున మద్దతు ప్రకటించారు. సూళ్లూరుపేట పట్టణ సిపిఎం నాయకులు ఎస్కె రియాజ్ మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చాలీచాలని వేతనాలతో దుర్భర జీవనం గడుపుతున్నారన్నారుర. రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలన్నారు. సమ్మెకాలపు ఒప్పందాలకు జీవోలను విడుదల చేయాలన్నారు. దహన సంస్కార ఖర్చుల కింద రూ.20వేల రూపాయలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.సాంబశివయ్య, సిహెచ్ సుధాకర్‌రావు, కె.లక్ష్మయ్య, బి.పద్మనాభయ్య, ఎస్కె అక్బర్ బాష, సంఘం నాయకులు వెంకటరత్నం, రామయ్య, చిన్నయ్య, కరీం, మురళి పాల్గొన్నారు.

యూనియన్ నుంచి గోపి బహిష్కరణ

గూడూరు టౌన్ : ఎపి మున్సిపల్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శిగా ఉన్న గోపిని సిఐటియు ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరిస్తున్నట్లు యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి డి.కోటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. సమ్మె విచ్ఛిన్నానికి పాల్పడుతూ, కార్మికులకు ద్రోహం చేస్తున్నందున గోపిని బహిష్కరించినట్లు వెల్లడించారు. గత కొంతకాలంగా హెచ్చరిస్తూనే ఉన్నా ఎటువంటి మార్పు లేకపోవడంతో ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు చెప్పారు.

స్వచ్ఛసర్వేక్షన్‌లో మెరిసిన తిరుపతి

అవార్డు అందుకున్న మేయర్, కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రతిష్టాత్మకంగా అందించే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు తిరుపతి నగరపాలక సంస్థ ఎంపికయ్యింది. గురువారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో కేంద్ర హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి నారాయణ, ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ లతో కలసి తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య లు అవార్డును అందుకున్నారు. మూడు లక్షల జనాభా కేటగిరీలో తిరుపతి నగర నగరపాలక సంస్థ సూపర్ స్వచ్ఛ లీగ్ ను కైవశం చేసుకుంది. మేయర్, కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలోని అధికారుల నుండి కింది స్థాయి సిబ్బంది, నగర ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధుల సహకారంతోనే ఈ అవార్డు సాధించగలిగామని అన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించగలుగుతామని ధీమా వ్యక్తం చేశారు.స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డును తిరుపతి ప్రజలకు అంకితం చేయనున్నట్లు మేయర్ డాక్టర్ శిరీష వెల్లడించారు.

'ఈ-పంట' పై అవగాహన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని వ్యవసాయ శాఖలో కొత్తగా బదిలీపై వచ్చినా విఏఏ, వీహెచ్ఎలకు పంట కోత ప్రైయోజనాలు, ఈ పంటలపై ఏఎస్ఓ సమక్షంలో మండల అగ్రికల్చర్ ఆఫీసు ఆధ్వర్యంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కె.షణ్ముగం, బుధవారం శిక్షణ కార్యాక్రమం నిర్వహించారు. అనంతరం మండల రైతులందరికీ అన్నదాత సుఖీభవ నగదు రావాలంటే ఈ కేవైసీ తప్పనిసరిని తెలియజేశారు. ఈ శిక్షణా కార్యక్రమాలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యన సహాయకులు, వ్యవసాయ విస్తరణ అధికారి రేవతి, మండల వ్యవసాయ అధికారి, షణ్ముగం, ఏఎసీ రమేష్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ఇంటి పరిసరాలనుశుభ్రంగాఉంచుకోవాలని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ సూచించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆమె మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని ఎన్టీఆర్ నగర్ తలారి పెట్టు విఎస్ పురం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలెవరూ చెత్తను బయట పారవేయకుండా తడి, పొడి చెత్తలను వేరు చేసి చెత్త డబ్బాలలో వేసి, పారిశుధ్య కార్మికులు ఇంటి దగ్గరకు వచ్చిన ప్పుడు చెత్త అందివ్వాలన్నారు. అనంతరం చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. చెత్తతో వర్మి కంపోస్టు ఎరువులను తయారు చేసి అమ్మకాలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో గామ కార్యదర్శి, సర్పంచి పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధి, తిరుమల నగర్ గ్రామపంచాయతీ, తిరుమల నగర్‌లో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక టిడిపి గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శుల గోవిందరాజులు, చెన్నరాయప్ప ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కూటమి ఏడాది పాలన కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి, ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ టిడిపి అధ్యక్షులు ఈశ్వరయ్య, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా వడమాలపేట మండలం, అప్పలాయ గుంట నుండి కమ్మపల్లి బీటీ రోడ్డు వరకు నాబార్డ్ నిధులతో రూ కోటి 31 లక్షల వ్యాయామంతో రోడ్డు నిర్మాణానికి నగరి శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్ చేతుల మీదుగా భూమి పూజ చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పరిష్కార చర్యలు సూచించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు బినబాబు, మాజీ అధ్యక్షులు వెంకయ్య, చిత్తూరు జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యక్షులు లక్ష్మీ ప్రసన్న, హైమవతి, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు మండలం, కందాడ పంచాయతీ, శివాపురంలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించి, ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నాగరాజ నాయుడు, రెడ్డివారి గురువారెడ్డి ధనంజయుల నాయుడు, నైనారు పొన్నారావు, శివశంకర్ రెడ్డి కార్యకర్తలు, ప్రజలు మరియు అధికారులు పాల్గొన్నారు.

అరణియార్ ప్రాజెక్టును ఆధునీకరించాలి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గం, పిచ్చాటూరు మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గురువారం నాలుగో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సత్తి వేడు నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు చిన్నరాజ్ పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టును విస్తరించి ఆధునీకరించాలని, సప్త వానల్ మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా వ్యవసాయానికి సానుకూలంగా ఉంటుందని తెలిపారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుభాష్, అన్న దొర, సురేష్, హరి, రైతు సంఘం నాయకులు ధనుంజయులు, మహిళా సంఘం నాయకులు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: 23న పిచ్చాటూరులో జరగనున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోనేటి ఆది మూలం పిలుపునిచ్చారు. గురువారం పిచ్చాటూరు ఎంపిడిఒ కార్యాలయ మీటింగ్ హాలులో జాబ్ మేళా పోస్టర్లను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈఎంసి క్లస్టర్, శ్రీ సిటీ, తిరుపతి, చెన్నైలోని బహుళ జాతీయ కంపెనీలలో 500 ఉద్యోగాలకు పైగా ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయన్నారు. ఇతర వివరాలకు 9440374535, 9908243736, 99888 53335 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహమ్మద్ రఫీ, మాజీ మార్కెటింగ్ ఛైర్మన్ డి.ఇలంగోవన్ రెడ్డి, పద్మ రాజు, ఆయకట్టు ఛైర్మన్ రవి, నాగ రెడ్డి, ఢిల్లీ బాబు, రాజేశ్వరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంజి మాధవయ్య జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్, మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య జన్మదిన వేడుకలను పుత్తూరు మండల టిడిపి నాయకులు అభిమానులు మైనారిటీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. అనంతరం అన్న దానం చేశారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మండల పార్టీ ప్రెసిడెంట్ ఎ బాలాజీ, ప్రధాన కార్యదర్శి హేమంత్ కుమార్, సింగిల్ విండో ఛైర్మన్ ఎస్ మోహన్ రాజు, కరుణ యాదవ్, తడుకు సర్పంచ్ వెంకటేష్ బొబ్బిలి యాదవ్, పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలపై అవగాహన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బస్టాండ్ ఆవరణలో గురువారం సాయంకాలం ట్రాఫిక్ నియంత్రణపై సర్కిల్ ఇన్స్పెక్టర్ తిమ్మయ్య ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు వచ్చే పోయే వాహనాలతో జాగ్రత్తలు పాటించాలని, రోడ్డు పై వెళ్లేటప్పుడు రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు. ఆటోవాలాలు ప్రయాణికులను మితంగా ఎక్కించుకుని భద్రంగా చేర్చాలని తెలిపారు. బాగా చదువుకొని తల్లిదండ్రులకు, గురువులకు, సమాజానికి మంచి పేరు ప్రతిష్టలు తేవాలని విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రయాణికులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సీతమ్మ భూముల వ్యవహారంపై సీఎం స్పందించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి, పంగులూరు సీతమ్మ నగర్‌లో ఉన్న ధర్మ సత్రం భూములపై సీఎం స్పందించి, మాజీ ఎంపీ టీజి వెంకటేష్, ఆయన అనుచరులను కట్టడి చేయాలని పొంగులూరు సీతమ్మ ఆర్యవైశ్య ధర్మసత్రం అధ్యక్షులు పామిడి సత్యనారాయణ శెట్టి విజ్ఞప్తి చేశారు. ఎంఆర్ పల్లిలోని సీతమ్మ నగర్ వద్ద గురువారం అయన విలేకర్లతో మాట్లాడుతూ టీజీ వెంకటేష్, అయిన అనుచరులు 42 ఎకరాల సీతమ్మ భూములను తమ బంధువులు అని చెప్పి వివాదాలు సృష్టిస్తూ, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీన్ని ప్రశ్నించినందుకు తమపై అక్రమ కేసులు పెట్టారని, రౌడీలతో బెదిరిస్తున్నారని వెల్లడించారు. పంగులూరి సీతమ్మ వీలునామా ప్రకారం తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు సేవలు అందించేందుకు తమ కమిటీ కృషి చేస్తుందని, ఆ భూముల పరిరక్షణ కోసం పోరాడుతున్నామన్నారు. ఆయన ఆగడాలపై సీఎం, డిప్యూటీ సీఎంలు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో నెలవల

ప్రజాశక్తి - నాయుడుపేట రూరల్ : నాయుడుపేట మండలం, మేనకూరులో గురువారం సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ అతిధులుగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంలు హాజరయ్యారు. వారికి టీడీపీ నాయకులు కట్టా వెంకట రమణారెడ్డి, స్థానిక టిడిపి నాయకులతో స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట జడ్పిటిసి సభ్యులు కట్టా జ్యోతి రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నల్లు కస్తూరయ్య, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజీనామా పదాన్ని చులకన చేయొద్దు

- నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - వెంకటగిరి: ఆరోపణలపై స్పందించి సీఎం పదవికి రాజీనామా చేసిన ఉన్నత నాయకుడు నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి అని నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నేదురుమల్లి నివాసంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన వచ్చిన ఆరోపణలపై జనార్ధన్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించి తప్పు చేయలేదని నిరూపించి కోర్టు ద్వారా క్లీన్ చిట్ తీసుకున్నారని గుర్తు చేశారు. జనార్ధన్ రెడ్డి అడుగుజాడల్లో వెంకటగిరి అభివృద్ధి చేసేందుకు నేదురుమల్లి కుటుంబం తమ వంతు కృషి చేస్తుందని స్పష్టం చేశారు. అవినీతి నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల సవాల్ విసరడం హస్యస్పథమని, రాజీనామా పదాన్ని కించపరచవదని హితవు పలికారు. నమ్మి గెలిపించాన ప్రజలకు న్యాయం చేయాలన్నారు. డక్కిలి మండలం, నర్స నాయుడు పల్లి పెద్ద చెరువులో మట్టిని తరలించి ప్రైవేట్ లేఔట్లను చదును చేస్తున్నారని, అధికారులకు ఆ ప్రాంత రైతులు మొరపెట్టుకున్న వారు స్పందించలేదంటే ఎంతటి రాజకీయ అండ ఉందో గ్రహించాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో, సబ్ రిజిస్టర్ కార్యాలయంలో, రెవెన్యూ కార్యాలయాల్లో మామూళ్లపై మౌఖిక ఆదేశాలే కానీ ఎక్కడా సంతకాలు ఉండవన్నారు. డక్కిలి మండలంలో ఒకేసు వ్యవహారంలో హైకోర్టు స్టేటస్ కో ఇచ్చిన అక్కడి రెవెన్యూ అధికారులు ధిక్కరిస్తున్నారంటే అది రాజకీయ ఒత్తిడి కాదాని ప్రశ్నించారు. అధికారులు అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి ప్రతిపక్ష పార్టీ సానుభూతిపరులకు అన్యాయం చేయడం సరి కాదని సూచించారు.

రాజీ లేని పోరాటమే లక్ష్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాజీ లేని పోరాటమే ఏఐటియుసి లక్ష్యమని ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు చంద్ర శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. గూడూరు, సివిసి పార్క్‌లో ఏఐటయుసిలోకి గూడూరు పురపాలక సంఘంలో పని చేస్తున్న 50 మంది మున్సిపల్ కార్మికులు చేరారు. ఈ కార్యక్రమానికి రాఘవులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు చంద్ర శేఖర్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌లు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి జి.శశి కుమార్, ఏఐటియుసి జిల్లా సహాయక కార్యదర్శి ఉదయ్ , ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు సి.వి.ఆర్ కుమార్, సీపీఐ చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు సివిఎల్, ఇన్సాఫ్ నాయకులు జమాల్, యాకోబు, వెంకట కృష్ణ , కొండయ్య, గోపి, ప్రసాద్, ఆటో యూనియన్ జిల్లా నాయకులు శ్రీనివాసులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఎస్వీయూ మేనేజ్మెంట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు మేనేజ్మెంట్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా ఆచార్య వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణంగా ప్రిన్సిపాల్ పదవి రెండు సంవత్సరాల కాల పరిమితితో వర్సిటీ ఉన్నతాధికారులు సీనియారిటీ ఆధారంగా నియమిస్తారు. వాణిజ్య శాస్త్ర విభాగానికి చెందిన ఆచార్య నరసయ్య ప్రిన్సిపల్‌గా పదవీకాలం ముగియడంతో ఈ మేరకు వర్సిటీ పరిపాలన భవనం నుంచి నూతన ప్రిన్సిపాల్‌గా ఆచార్య వెంకటేశ్వర్లు నియామకం ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

ఓటరు హెల్ప్ లైన్ యాప్‌పై అవగాహన కల్పించండి

ప్రజాశక్తి - సత్యవేడు: ఎన్నికల సంఘం తీసుకొచ్చిన ఓటరు హెల్ప్ లైన్ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించి 18 సంవత్సరాలు వయోపరిమితి నిండిన వారిని గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలని బిఎల్వోల శిక్షణ కార్యక్రమంలో సత్యవేడు తహశీల్దార్ రాజశేఖర్ సూచించారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో భారత్ అంతర్జాతీయ ప్రజాస్వామ్య సంస్థ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏడవ బ్యాచ్ బిఎల్ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డిటి త్యాగరాజు, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ సురేష్, ఎలక్షన్ డేటా ఎంట్రీ ఆపరేటర్ మాధురి, మండలంలోని బిఎల్వోలు పాల్గొన్నారు.

పురుగు మందులు కొంటేనే.. యూరియా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఎరువుల దుకాణ యజమానుల షరతులతో యూరియా అందక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్‌లో ఈ ఏడాది 15 వేల హెక్టార్లలో వరి పంటలు సాగవుతాయని శ్రీకాళహస్తి వ్యవసాయశాఖ అంచనా వేసింది. వరిసాగులో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుంది. వాటితో పాటు డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ తదితరాలు వినియోగిస్తారు. ఎరువులను సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల దుకాణాల ద్వారా కొనుగోలు చేస్తారు. ఈ ఎరువుల్లో 60 శాతం వరకు ప్రైవేటు దుకాణాల ద్వారా లభిస్తున్నాయి. ఇటీవల యూరియా వాడకం ఎక్కువ కావడంతో డిమాండ్ ఏర్పడి రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రయివేట్ దుకాణదారులు యూరియా కావాలంటే కాంప్లెక్స్ ఎరువులు, పురుగు మందులు కొనాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదేంటని అడిగితే ప్రయివేట్ దుకాణాలకు ఎరువులు సరఫరా చేస్తున్న కంపెనీలే షరతు పెడుతున్నట్లు దుకాణదారులు చెబుతుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో యూరియా కావాలంటే మందులు కొను.. లేకుంటే పో అని తెగేసి చెప్తున్నారని రైతులు వాపోతున్నారు. ఫలితంగా రూ.270 యూరియా కోసం రూ.3 వేలు విలువ జేసే కాంప్లెక్స్ ఎరువులు, పురుగు మందులు ఎక్కడ కొనేదంటూ రైతులు వెనుదిరుగుతున్నారు.

కొనకుంటే పొమ్మన్నారు: వెంకటయ్య, మాజీ సర్పంచి, చిందేపల్లి

యూరియా కావాలని ఏర్పేడు గ్రోమోర్ ఎరువుల దుకాణంకు వెళితే కాంప్లెక్స్ ఎరువులు కొనమన్నారు. లేకుంటే పొమ్మన్నారు. ఇదెక్కడి న్యాయం అంటే కంపెనీలే అలా ఉన్నాయని సమాధానం చెప్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

తోపుడు బండ్ల వ్యాపారస్తుల

నగర 7వ మహాసభలను జయప్రదం చేయండి

తోపుడుబండ్ల వ్యాపారస్తులకు న్యాయం చేయాలని మాట్లాడుతున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో తోపుడుబండ్ల వ్యాపారస్తులు సంఘం సిఐటియు అనుబంధం నగర ఏడవ మహాసభలో ఈనెల 22వ తేదీ మంగళవారం వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నామని కరపత్రాలను తోపుడుబండ్ల వ్యాపారస్తుల సంఘం ఆధ్వర్యంలో తుడా సెంటర్ వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాంలో సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు టి సుబ్రహ్మణ్యం, ఎం మాధవ్, తోపుడుబండ్ల వ్యాపారస్తుల యూనియన్ ప్రధాన కార్యదర్శి పి బుజ్జి, సిఐటియు నాయకులు కే వేణుగోపాల్‌లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ తిరుపతిలో తోపుడుబండ్ల పై వ్యాపారాలు చేసుకుంటూ దాదాపు 7,000 మందికి పైచిలుకు జీవనం సాగిస్తున్నారన్నారు. చాలీ చాలని ఆదాయంతో, ఎండకు, వానకు, దుమ్ముకు కష్టపడుతూ వ్యాపారం చేసుకుని బతుకుతున్న చిరు వ్యాపారుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందన్నారు. 2014 స్ట్రీట్ వెండింగ్ కమిటీ చట్టం ప్రకారం వీధులలో, బహిరంగ ప్రదేశాలలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకునేవారికి లైసెన్సులివాలని, గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారిపై మున్సిపల్ అధికారులు, పోలీసులు దౌర్జన్యం చేయడం తగదన్నారు. పోలీసులు పిటీ కేసులు రాయడం మానుకోవాలని కోరారు. సిఐటియు తోపుడుబండ్ల వ్యాపారస్తుల నగర ఏడవ మహాసభలు ఈనెల 22వ తేదీ యశోద నగర్ వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో తిరుపతి నగర వీధి వ్యాపారస్తులు పాల్గొని, వారి సమస్యలపై సమీక్ష చేసుకోవాలని పిలుపునిచ్చారు. నూతన నాయకత్వాన్ని ఎన్నుకొని పోరాటాలను రూపొందించుకోవడం కోసం ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోపుడు బండ్ల వ్యాపారస్తుల సంఘం నగర అధ్యక్షులు పి ప్రసాద్, రామాంజులు, కుమార్, లక్ష్మి, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసం చేయడంలో దిట్ట : మాజీ ఎమ్మెల్యే కిలివేటి

ప్రజాశక్తి -దొరవారిసత్రం : సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో కల్లబొల్లి కబుర్లు చెప్పి, సూపర్-6 పథకాలు అంటూ ప్రజలను మభ్యపెట్టి మోసం చేయడంలో దిట్ట అని సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. గురువారం మండల పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హామీలు నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ఆరోపించారుఏ. సకాలంలో హామీలు నెరవేర్చిన ఘనత మాజీ సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ అల్లూరు రాహుల్ రెడ్డి, సీనియర్ నాయకులు వేణుబాకం మునిస్వామి నాయుడు, సురేష్ రెడ్డి, మురళి నాయుడు, జాలారాజగోపాల్ కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.

ఏజెన్సీల్లో హస్తకళల అభివృద్ధి: డాక్టర్ పసుపులేటి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఏజెన్సీ ప్రాంతాల్లో హస్తకళలను అభివద్ధి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. రంపచోడవరం నియోజకవర్గంలో పర్యటించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనల మేరకు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ ,పార్లమెంట్ ఇంఛార్జి డాక్టర్ గంగులయ్య , పిఎసి రాజశేఖర్ రెడ్డి ఆహ్వానం మేరకు ఆదివాసి ప్రాంతం అరకు పార్లమెంటు రంపచోడవరం నియోజకవర్గం వేముల వాడ పంచాయతీ సువర్లపాడు గ్రామంలో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ నివసిస్తున్న 40 కుటుంబాలు హస్త కళా నైపుణ్యంతో వెదురుతో తయారు చేసిన సోఫాలు, పూజ సామాగ్రి, కాఫీ కప్పులు, వాటర్ బాటిల్, షోకేస్ వస్తువులను పరిశీలించారు. వారి నైపుణ్యాన్ని గుర్తించి వారు తయారు చేస్తున్న వస్తువులకు ప్రాముఖ్యత తీసుకొని రావడానికి ఇక్కడికి వచ్చామన్నారు. ఈ కళాకారుల నైపుణ్యం అద్భుతంగా ఉందని కొనియాడారు. వీరు తయారు చేసిన వస్తువులకు క్యూ ఆర్ కోడ్, జిఐ టాగింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. వారి కోరిక మేరకు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారితో మాట్లాడి వాళ్లకు ముడి సరుకు సరసమైన ధరలకు లభించే విధంగా, అలాగే వారు చేసిన వస్తువులకు లాభదాయకమైన ధరలు లభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం నియోజకవర్గం ఏమ్మెల్యే మిరియాల శిరీష దేవి పాల్గొన్నారు.

ఐఐటీలో 'ఫుడ్ ప్రాసెసింగ్' ప్రారంభం

ప్రజాశక్తి-ఏర్పేడు : ఏర్పేడు సమీపంలోని ఐఐటి తిరుపతి క్యాంపస్‌లో 3. 95 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన కామన్ ఇంక్యుబేషన్ సెంటర్ ను (సిఐసి) కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రివర్యులు చిరాగ్ పాస్వాన్ జీ వర్చువల్ పద్ధతిలో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, కేంద్ర ఆహార ప్రాసెసింగ్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి దేవేష్ దేవాల్ (మోఫ్పీ జాయింట్ సెక్రటరీ), ఏపీకి చెందిన ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ కార్యదర్శి సంజీవ్ చౌదరి, ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సిఐసి సెంటర్ ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లోని యువత, గ్రామీణ పారిశ్రామికకు ప్రోత్సాహంగా నిలిచి ముఖ్యంగా టమోటా, మామిడి వంటి పంటల ప్రాసెసింగ్, వాల్యూ ఎడిషన్ పై దష్టి సారించి ఆహార ప్రాసెసింగ్ రంగంలో స్టార్టప్స్ కు మద్దతు ఇవ్వడమే లక్ష్యంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఇంక్యుబేషన్ సెంటర్ వలన ఉమ్మడి చిత్తూరు జిల్లాల అభివృద్ధికి తోడ్పడేలా గ్రామీణ పారిశ్రామవేత్తలకు ప్రోత్సాహం లభించనుంది. ఇప్పటివరకు రూ. 3.95 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టామని, ఇందులో రూ. 2.75 కోట్లు మోఫ్పీ ద్వారా, రూ. 1.20 కోట్లు ఐఐటి నిధుల నుండి ఖర్చు చేశామన్నారు. ఇంకా రూ. 60 లక్షలు అవసరం ఉందని, ప్రభుత్వ సహకారం కోరుతున్నామని తెలిపారు.కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్ జీ ప్రసంగిస్తూ ఆహార ప్రాసెసింగ్ రంగంలో విలువ వద్ధి, పారిశ్రామికతను ప్రోత్సహించడంలో కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యతను ఎల్లప్పుడూ ఉంటుందని, ఐఐటి తిరుపతి, మోఫ్పీ సహకారంతో ఏర్పాటుచేసిన సిఐసి ఒక ఆదర్శ ప్రాజెక్టుగా నిలుస్తుందని, ఇది "ఆత్మ నిర్భర్ భారత్" రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం అనే లక్ష్యాలకు అనుగుణంగా ఉందన్నారు. ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కామన్ ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పడడతో మన ప్రాంత యువత, రైతులకు మార్గదర్శకంగా, ఉపాధి అవకాశాలను కలిగించేదిగా మారుతుందన్నారు. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో తోటల వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్ అవసరాలపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వ స్థాయి సలహా మండలి ఏర్పాటు చేయాలని సూచించారు.

క్రైం న్యూస్

దుకాణంలో చోరీ

ప్రజాశక్తి - దొరవారిసత్రం: దొరవారి సత్రం మండల కేంద్రంలోని జాతీయ రహదారి సమీపంలో విద్యుత్ సబ్ స్టేషన్‌కు సమీపంలో ఉన్న దుకాణంలో గత రాత్రి దొంగలు పడి దోచుకు వెళ్లిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు మైలాంగం గ్రామానికి చెందిన కర్లపూడి రమణయ్య దొరవారిసత్రంలో చిన్నపాటి దుకాణం నడుపుతున్నాడు. బుధవారం రాత్రి యధావిధిగా అంగడి మూసుకుని వెళ్ళాడు. ఆ రాత్రి గుర్తు తెలియని దొంగలు తాళాలు పగలగొట్టి అందులో ఉన్న 27,000 నగదు, 100 సిగరెట్ ప్యాకెట్స్, పలు రకాల తినుబండారాలు, పది రూపాయల నాణేలు దోచుకోళ్లారు. సుమారు 40 వేల రూపాయలు విలువైనవి దోపిడీకి గురైనట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దొరవారి సత్రం పోలీసులు తెలిపారు.

జామీను ఇచ్చిన వ్యక్తికి జైలు శిక్ష

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ముద్దాయిలకి జామీను ఇచ్చి, వారు హాజరు కాక పోవడంతో జామీను ఇచ్చిన వ్యక్తికి 6 నెలల జైలు శిక్ష లేదా రూ. 25వేలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పునిచ్చారు. ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో 2016లో కర్నాటకకు చెందిన ఆసీఫ్ ఆలీ షేక్ (34) అరెస్ట్ అయ్యాడు. అతనికి రేణిగుంట మండలానికి చెందిన కె. వెంకట రమణ జామీను ఇచ్చాడు. ముద్దాయి వాయిదాలకు హాజరు కాకపోవడంతో జామీను ఇచ్చిన వెంకటరమణకు ఆరు నెలలు జైలు శిక్ష లేదా, రూ. 25 వేలు జరిమాన విధించారు. దీనిపై టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎర్రచందనం కేసుల్లో ముద్దాయిలకు జామీను ఇచ్చే ముందు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జామీను ఇచ్చి జైలు పాలు కావద్దని హెచ్చరించారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థి దశ నుంచి మత్తు పదార్థాలకు బానిసై ఉజ్వలమైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఈగల్ టీం యాంటీ డ్రగ్ అవేర్నెస్ టీం సిఐ ప్రసాద్ పిలుపునిచ్చారు. యస్వీయు విద్యార్థి సాంస్కృతిక విభాగం కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి ఆధ్వర్యంలో ఏటీఎన్స్ డిగ్రీ కళాశాలలో గురువారం "యాంటీ డ్రగ్ అవేర్నెస్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏటీఎన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగు హల్చల్

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండలంలోని నెరబైలు గ్రామపంచాయతీ పులిబోనుపల్లి సమీపంలో మామిడి తోటలలో గత నాలుగు రోజులుగా ఒంటరి ఏనుగు హల్చల్ చేస్తున్నట్లు ఫారెస్ట్ అధికారి సలావుద్దీన్ తెలిపారు. స్థానిక గ్రామ ప్రజలు, పంట పొలాలల్లోకి వెళుతున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఎలిఫెంట్ టాస్క్ ఫోర్స్ అధికారులు ఒంటరి ఏనుగును దారి మళ్లించడానికి ప్రయత్నిస్తున్నట్లు రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని తెలిపారు.

ఐఓసీఎల్ గ్యాస్ స్టోరేజ్ కేంద్రానికి భూమిపూజ

ప్రజాశక్తి -తిరుమల: టీటీడీ భవిష్యత్ అవసరాల నిమిత్తం తిరుమలలోని ఔటర్ రింగ్ రోడ్డులో 45 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గ్యాస్ స్టోరేజ్ కేంద్ర నిర్మాణానికి గురువారం టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్. నాయుడు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా ఐఓసీఎల్ సంస్థ ఎల్పీజీని టీటీడీకి నిరంతరాయంగా సరఫరా చేస్తోందని, ఇకపై 30 సంవత్సరాల పాటు ఎల్పీజీ సరఫరాకు టీటీడీ-ఐఓసీఎల్ ఒప్పందం కుదిరిందని తెలిపారు. రూ.8.13 కోట్ల వ్యయంతో 1.86 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్లాంట్‌ను టీటీడీ-ఐఓసీఎల్ సంయుక్తంగా ఆరు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు. ఈ గ్యాస్‌ను లడ్డూ ప్రసాదాలు, అన్నప్రసాదాల తయారీకి వినియోగించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుల వల్ల టీటీడీకి సంవత్సరానికి రూ.1.5 కోట్ల ఆదా జరుగుతుందని పేర్కొన్నారు.

రాజన్న ఫౌండేషన్‌కు సియస్ఆర్ టైమ్స్ అవార్డ్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : అమర రాజా కంపెనీ సౌజన్యంతో నడిచే రాజన్న ఫౌండేషన్ మిషన్‌కి వికాసిత్ భారత్ లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పాత్ర 2047 లో భాగంగా, గ్రామీణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి విభాగంలో ప్రతిష్టాత్మకమైన "సి యస్ ఆర్ టైమ్స్ అవార్డ్ 2025 నీ అందుకున్నది. ఈ అవార్డ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీకి, ప్రత్యేకంగా గ్రామీణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి రంగంలో రాజన్న ఫౌండేషన్ అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈరోజు దేశ రాజధాని న్యూఢిల్లీ లోని లిమిరోడియన్ హోటల్‌లో ప్రముఖ సిఎస్ఆర్ మార్కెటింగ్, బ్రాండ్ హానాక్ సంస్థ వారిచే గ్లోబల్ సిఎస్ఆర్ అవార్డ్స్ 2025 ప్రధానోత్సవ కార్యక్రమంలో ఈ అవార్డుని రాజన్న ఫౌండేషన్ హెడ్ రాళ్లపల్లి సతీష్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ అవార్డు అందుకోవడం ద్వారా మా అమర రాజా రాజన్న ఫౌండేషన్ సంస్థ సానుకూల సామాజిక ప్రభావాన్ని సృష్టించేందుకు నిబద్ధతకు నిదర్శమని, రాబోవు కాలంలో రాజన్న ఫౌండేషన్ ద్వారా అనేక రంగాలలో విశిష్టమైన సేవలు అందిస్తామని అమర రాజ సంస్థల ఛైర్మన్ గల్లా జయదేవ్ తెలిపారు.

గ్రామ బహిష్కరణ ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలం, మొనపాళెంలో ఓ కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేశారంటూ గత రెండు రోజులుగా వచ్చిన వదంతులు నిజం కావని వాకాడు మండల తహశీల్దార్ రామయ్య వెల్లడించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌తోపాటు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎస్సై నాగబాబులు గురువారం గ్రామంలో పర్యటించారు. తహశీల్దార్ మాట్లాడుతూ మొనపాళెం గ్రామంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వివాదం చెలరేగి ఓ కుటుంబాన్ని వెలివేశారని వచ్చిన ఆరోపణలపై గ్రామంలో విచారించడం జరిగిందన్నారు. భూ ఆక్రమణల వివాదంలో గ్రామం ఒక్కటై తమ కుటుంబాన్ని వెలివేశారని ఆశిరెడ్డి కుటుంబం వాపోవడంతో పూర్తి స్థాయిలో విచారణ జరపడంతో అందులో వాస్తవం లేదని ఆయన తేల్చారు. ఒక వేళ భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరిగినా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూ వివాదానికి సంబంధించి ఆక్రమణ దారులకు నోటీసులు ఇవ్వడం జరుగుతుందన్నారు.

వ్యర్థ రహిత రైల్వే స్టేషన్‌గా తిరుపతి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : తిరుపతి రైల్వే స్టేషన్‌ను వ్యర్థ రహితంగా తీర్చిదిద్దేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. గురువారం స్టేషన్ మేనేజర్ చిన్నప రెడ్డి అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. రైల్వే స్టేషన్ నుండి ప్రధాన ప్రాంతాలకు స్పష్టమైన దిశా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించారు. ప్రైవేట్ ట్రావెల్స్ ఏజెంట్ల దందాను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు సూచించారు. తిరుపతి నుండి మరిన్ని స్టేషన్లకు రైలు మార్గాలను విస్తరించాలని, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు తగిన చర్యలు చేపట్టాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ మురళీ కృష్ణ, డివిజనల్ రైల్వే కమిటీ సభ్యుడు సాకం కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు వై.ఎస్. బాబు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE: TIRUPATI
Succession O.P.No.2/2025
K.Revathi ...Petitioner
V/s
1) T.Leelavathi
2) The Assistant Executive Officer (R-1), TTD Tirumala ...Respondents
PUBLIC NOTICE
ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా తిరుపతి తిరుమల దేవస్థానముల జనరల్ అడ్మినిస్ట్రేషన్ MORS గెస్ట్‌హౌస్, AEO (R-1) తిరుమలలో Sharoff/Assistant గా పని చేయుచూ చనిపోయిన టి.వెంకటవర ప్రసాద్ తండ్రి లేట్ క్రిష్ణయ్య గారికి రావలసిన Death Benefits పొందుటకు తన వారసురాలనీ పిటీషనర్ పై కోర్టు ఎదుట పిటిషన్ దాఖలు చేసియున్నారు. ఇందులో ఎవరికైనా అభ్యంతరం వున్నయెడల పై కనపరచిన కోర్టువారి ఎదుట 07.08.2025 తేదీన ఉదయం 10.30 గం॥లకు హాజరై స్వయముగా గాని లేక మీ తరపున న్యాయవాదిచే గాని అభ్యంతరం తెలుపుకొనవచ్చును. లేకున్నా తమ పరోక్షమున తీర్మానించబడును.
కోర్టువారి ఉత్తర్వుల మేరకు
బి.యల్లప్ప
పిటిషనర్ తరపున న్యాయవాది, తిరుపతి

మహా రాజ రాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో: శ్రీకాళహస్తి
H.M.O.P. No. 44/2024
టి. లక్ష్మమ్మ ...వాది
V/s
బి. శంకర్ రెడ్డి ...ప్రతి వాది
నోటేసు
పై విడాకుల దావా నందు పైన తెలిపిన వాది, ప్రతి వాది పై విడాకుల దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావా 18-07-2025 నకు వాయిదా ఉన్నది. కావున ఈ క్రింది తెలిపిన ప్రతి వాది సదరు తేదీన ఉదయం గం. 10.30 ని. లకు స్వయముగా గానీ వకీలు ద్వారా గానీ సదరు కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.
రెస్పాండెంట్:
శ్రీ B. శంకర్ రెడ్డి, S/o B. చెంగా రెడ్డి, పాడిపేట గ్రామం, తిరుపతి రూరల్ మండలం, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.
యస్.గౌస్ బాషా, బి.ఏ., బి.యల్
న్యాయవాది: శ్రీకాళహస్తి

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) :PUTTUR
I.A.No. 15, 16, 17/2025
OS.NO. 160 / 2018
B.Vijayabhaskar ...Petitioner/Plaintiff
VS
P.Balaram (Died) and others ...Respondents/Defendants
NOTICE TO RESPONDENT NO.8
TO
R8: P.Nagamma, W/o Late P.Balaram Residing at No.4-1-13, Patnool Street, Tirupati, Tirupati District.
Please take notice that the above case is posted for your appearance on 31.07.2025 before the Civil Judge (Senior Division) Puttur at 10.30 AM. Failure to appear on the said date by you, the matter will be decided on exparte.
// By Order //
Sri M.Mohan Raju, M.A., LL.B.,
Advocate,
New Balaji Colony,
Tirupati

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE, SRIKALAHASTI
O. S. NO. 03 / 2020
M. Sudhakar Naidu ...Plaintiff
Vs
G. Jayachandra Naidu ...Defendant
To
G. Jayachandra Naidu, son of Kothanda Naidu, Hindu, aged about 62 years, residing at D. No. 1-135, Upstairs, Madars Road, Srikalahasti, Tirupati district.
1. Take notice that the above case stands posted to 18-07-2025 at 10:30 am in the court of Hon'ble Senior Civil Judge, Srikalahasti for the appearance of the Defendant herein to answer the claim of the Plaintiff.
2. The Hon'ble Court had directed the Defendant to appear on 18-07-2025 at 10:30 am in the court of Hon'ble Senior Civil Judge, Srikalahasti and file your objection if any for the claim of the plaintiff.
3. If the Defendant fails to attend the court on 18-07-2025 at 10:30 am, the matter will be decided exparte and the court will proceed with the matter accordingly.
C. HEMANTH KUMAR, B.COM., L.L.B., (Hon's)
C. DINESH KUMAR, B.A., L.L.B., (Hon's)
ADVOCATES,
Cell No. 7075895858.

మహారాజశ్రీ శ్రీకాళహస్తి అదనపు జూనియర్ సివిల్ జడ్జికోర్టులో
I.A.NO. 7/2023
O.S.No.25/2023
సురకాని వరదరాజులు వగైరా ...పిటిషనర్స్
మరియు
పులుసు రవి వగైరా ...రెస్పాండెంట్స్
TO:
R2:ఇనుకల శంకర్, తండ్రి సుబ్బరాజు, శివగిరిపల్లి గ్రామం, మద్దిలేడు పోస్టు, ఏర్పేడు మండలం, తిరుపతి జిల్లా.
నోటీసు
ఇందుమూలముగా పై పిటిషన్ నందు రెండవ రెస్పాండెంట్ అయిన నీకు తెలియజేయడం ఏమనగా పై పిటిషన్ నందు నీ హాజరు కోరుతూ I.A.NO. 7/2023 వాయిదా 25.07.2025న కలదు. కావున నీవుగాని, నీ అనుమతి పొందిన ప్లీడరు గానీ 25.07.2025 ఉదయం 10:30గం॥లకు పై కోర్టునందు హాజరై ఏదైని ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కాని పక్షములో నీ పరోక్షమున పిటిషన్‌ను తీర్మానించబడునని తెలియజేయడమైనది.
ఇట్లు
సి.వెంకటస్వామి
న్యాయవాది, శ్రీకాళహస్తి

మహారాజశ్రీ శ్రీకాళహస్తి అదనపు జూనియర్ సివిల్ జడ్జికోర్టులో
I.A.NO. 8/2023
O.S.No.25/2023
సురకాని వరదరాజులు వగైరా ...పిటిషనర్స్
మరియు
పులుసు రవి వగైరా ...రెస్పాండెంట్స్
TO:
R2: ఇనుకల శంకర్, తండ్రి సుబ్బరాజు, శివగిరిపల్లి గ్రామం, మద్దిలేడు పోస్టు, ఏర్పేడు మండలం, తిరుపతి జిల్లా.
నోటీసు
ఇందుమూలముగా పై పిటిషన్ నందు రెండవ రెస్పాండెంట్ అయిన నీకు తెలియజేయడం ఏమనగా పై పిటిషన్ నందు నీ హాజరు కోరుతూ I.A.NO. 8/2023 వాయిదా 25.07.2025న కలదు. కావున నీవుగాని, నీ అనుమతి పొందిన ప్లీడరు గానీ 25.07.2025 ఉదయం 10:30గం॥లకు పై కోర్టునందు హాజరై ఏదైని ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కాని పక్షములో నీ పరోక్షమున పిటిషన్‌ను తీర్మానించబడునని తెలియజేయడమైనది.
ఇట్లు
సి.వెంకటస్వామి
న్యాయవాది, శ్రీకాళహస్తి